సాక్షి విశాఖపట్నం

బుధవారం । 1 । అక్టోబర్ । 2025



గజలక్ష్మిగా కనకమహాలక్ష్మి

నవరాత్రుల సందర్భంగా శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు మంగళవారం భక్తులకు గజలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. లక్ష్మీదేవి రూపాలలో ఒకటైన గజలక్ష్మి అలంకారంలో అమ్మవారు సువర్ణ కాంతులతో వెలుగొందుతూ, భక్తులను అనుగ్రహించారు.

- II వ పేజీలో

అప్పన్న సన్నిధిలో ఉత్తరాఖండ్ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ అలోక్ మెహ్రాకి అప్పన్న చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఉత్తరాఖండ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలోక్ మెహ్రా కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో న్యాయమూర్తి పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను సూపరింటిండెంట్ వెంకటేశ్వరరావు అందజేశారు.

సింహాచలం దేవస్థానానికి బ్యాటరీ కారు అందజేత



బ్యాటరీ కారుతో ట్రయల్ రన్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ బ్యాటరీ కారును వితరణగా అందజేసింది.సుమారు రూ. 8 లక్షలు విలువ చేసే ఈ బ్యాటరీ కారును సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఎమ్‌వో శంకర్ సుబ్రహ్మణ్యం సింహగిరిపై దేవస్థానం అధికారులకు అందజేశారు. అనంతరం దేవస్థానం అర్చకులు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఇతర అధికారులు, కోరమాండల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

3 నుంచి నూతన ఉపాధ్యాయులకు శిక్షణ


ఆరిలోవ: డీఎస్సీ–2025 ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు వచ్చే నెల 3వ తేదీ నుంచి 10 వరకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాల్లో శిక్షణ కోసం ఐదు సెంటర్లు కేటాయించినట్లు తెలిపారు.డీఎస్సీ–2025 ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాల్లో 1,139 ఉపాధ్యాయులు నియమితులయ్యారు. వారికి విశాఖ జిల్లాలో మూడు సెంటర్లు, అనకాపల్లి జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేసినట్లు డీఈవో తెలిపారు. విశాఖలో చినగదిలి మండలం రుషికొండ ఐటీ సెజ్‌లో రెండు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, పెందుర్తి మండలంలో పెందుర్తి సమీపం నర్సింగ్ కళాశాల, అనకాపల్లి జిల్లాలో సబ్బవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరులో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులకు ఇప్పటికే ఇచ్చిన నియామక పత్రాలతో పాటు శిక్షణ తేదీలు, కేంద్రం కేటాయించి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

రేపటి నుంచి వన్యప్రాణి వారోత్సవాలు



ఆరిలోవ: ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో గురువారం నుంచి 8 వరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు క్యూరేటర్ జి. మంగమ్మ మంగళవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులు, ప్రజల కోసం వివిధ పోటీలు నిర్వహించనున్నారు. వీటిలో బర్డ్ వాక్, ఫొటోగ్రఫీ, రేఖాచిత్ర పోటీలు, ప్రసంగ పోటీలు వంటివి ఉన్నాయి. పోటీల్లో పాల్గొన్నవారికి సర్టిఫికెట్లు, విజేతలకు బహుమతులు అందజేస్తారు. మరిన్ని వివరాల కోసం జూ ఎడ్యుకేషన్ ఆఫీసర్ 78936 32900 నంబరును సంప్రదించాలని ఆమె సూచించారు.

మందులపై GST ₹ మతలబు



ధరల్లో కనిపించని వ్యత్యాసం | పాత ధరలతోనే దోపిడీ

- మెడికల్ షాపుల్లో కనిపించని జీఎస్టీ తగ్గింపు బోర్డులు
- తనిఖీ చేయని డ్రగ్స్ డిపార్ట్‌మెంట్
- పట్టించుకోని వాణిజ్య పన్నుల శాఖ

మహారాణిపేట: ప్రజలకు దసరా కానుకగా జీఎస్టీ భారాన్ని కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. ఈనెల 22 నుంచి కొత్త శ్లాబులను అమల్లోకి తెచ్చింది. ముఖ్యంగా నిత్యావసరాలు, వాహనాలు, ఎలక్ట్రికల్ వస్తువులు, గృహోపకరణాలతోపాటు, ప్రజారోగ్యం దృష్ట్యా పలు మందులపైనా జీఎస్టీని కుదించింది. అయితే ప్రతి ఇంట్లో ఉపయోగించే మందులపైన ప్రజల్లో అవగాహన లోపం వ్యాపారులకు వరంగా మారింది. జీఎస్టీ అమలులోకి వచ్చిన తేదీకి ముందే రేట్లు ముద్రించడంతో అవి కాస్తా హోల్‌సేల్ నుంచి రిటైల్ షాపులకు చేరాయి. దీంతో జీఎస్టీ తగ్గింపు సాధ్యపడే పరిస్థితి లేదని వ్యాపారులు వెల్లడిస్తున్నారు. మరోవైపు కేంద్రం పాత రేట్లతో పనిలేదు.. జీఎస్టీ తగ్గింపు నాటి నుంచే అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. అయితే అది అమలుకావడం లేదు. దీంతో మందుల్లో మతలబుతో జనానికి ఎటువంటి ఊరట లభించడం లేదు.

నిలువు దోపిడీ, బిల్లుల మాయం

జిల్లాలోని దాదాపు 2,200 మెడికల్ స్టోర్స్, 600 హోల్‌సేల్ షాపుల్లో మందుల కొనుగోలుకు బిల్లులు ఇవ్వడం లేదు. బిల్లు అడిగితే ఇస్తామని చెప్పి జాప్యం చేస్తున్నారు. కొనుగోలు ధర ఒకటి, బిల్లులో నమోదు చేసే ధర మరొకటిగా ఉంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక మందుల ప్యాకెట్లపై గడువు తేదీలు కూడా సరిగా కనిపించక పోవడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో అదనపు బేరం

చాలా ప్రైవేట్ ఆస్పత్రుల్లో సొంతంగా మెడికల్ షాపులు నడుపుతూ రోగులను నిలువుదోపిడీ చేస్తున్నారు. ఆస్పత్రిలో చేరిన రోగులు అక్కడే మందులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. వైద్యులు సైతం తమ షాపుల్లో లభించే మందులనే రాయడం గమనార్హం. ఈ షాపుల్లో మందులపై ఎలాంటి తగ్గింపులు లేకుండా ఎంఆర్‌పీకే విక్రయిస్తున్నారు.



అమల్లోకి కొత్త జీఎస్టీ

మందులపై జీఎస్టీ తగ్గింపు ధర ఈనెల 22 నుంచి అమలులోకి వచ్చింది. సవరించిన ధరలతో మెడికల్ షాపుల్లో బోర్డులు పెట్టాలి. ఎక్కడ ఈ బోర్డులు కనపించడం లేదు.



జీఎస్టీ బోర్డు లేని ఓ మెడికల్ షాపు

పాత స్టాక్ పేరుతో దోపిడీ

జీఎస్టీ తగ్గింపు కారణంగా క్యాన్సర్, గుండె జబ్బులు, దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన అత్యవసర మందుల ధరలు తగ్గుతాయనే ప్రచారం కేవలం ఆర్భాటంగానే మిగిలిపోయింది. మందుల షాపుల యాజమానులు పాత స్టాక్ పేరు చెప్పి పాత ధరలకే విక్రయిస్తున్నారు. పాత స్టాక్ పూర్తయిన తర్వాతే కొత్త ధరలు అమలవుతాయని చెబుతుండగా, పాత స్టాక్ నిల్వలపై కొత్త ధరలు వర్తింపజేయడానికి నిబంధనలు ఉన్నా వాటిని అమలు చేయడం లేదు.

నిఘా కరువు

జీఎస్టీ తగ్గింపు ధరలు (సెప్టెంబర్ 22 నుంచి అమలులోకి వచ్చినా) అమలుపై నిఘా పూర్తిగా కొరవడింది. ఔషధ నియంత్రణ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ పర్యవేక్షణలో, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఎక్కడా తనిఖీలు గానీ, సోదాలు గానీ చేసినట్లు కనిపించడం లేదు. లంచాల మత్తులో అధికారులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ రెండు శాఖల అధికారులు ఈ బాధ్యత మాది కాదు అంటూ ఒకరిపై మరొకరు నెట్టుకుంటుండంతో జిల్లాలో జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు ప్రజలకు అందడం లేదు.

పాత జీఎస్టీ	కొత్త జీఎస్టీ	ఎంఆర్‌పీ తగ్గింపు
12 శాతం	5 శాతం	6.25 శాతం
18శాతం	5 శాతం	11.02 శాతం
5 శాతం	జీరో శాతం	4.77 శాతం

ప్రతి షాపులో జీఎస్టీ తగ్గింపు బోర్డు పెట్టాలి

ఈ నెల 22వ తేదీ నుంచి అన్ని మెడికల్ షాపులు, హోల్‌సేల్ షాపుల్లో జీఎస్టీ తగ్గింపు ప్రకారం తగ్గించిన ధరలకే మందులు విక్రయించాలని ఉత్తర్వులు ఇచ్చాం. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ నాయకులతో సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించాం. అంతేకాక ప్రతి షాపులో జీఎస్టీ తగ్గింపు ధరలు బోర్డు పెట్టి ధరలు ప్రకటించాలని ఆదేశించాం.


–విజయకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ శాఖ, విశాఖ

చూపు లేని దారుల్లో... అంధమైన స్నేహం



ఆ చీకటి దారిలో వారిద్దరికీ కళ్లు కనిపించకపోవచ్చు. కానీ, ఒకరిపై ఒకరికి ఉన్న నమ్మకం, తోడుగా నడిచే దృఢ సంకల్పం వారి కళ్లకు వెలుగుగా మారింది. విశాఖలోని రద్దీగా ఉండే పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డుపై కనిపించిన ఈ దృశ్యం ఎందరికో స్ఫూర్తినిచ్చింది. ఓ పక్క వాహనాల రణగొణ ధ్వనులు, మరో పక్క జనసందోహం. నిత్యం ట్రాఫిక్‌తో కిటకిటలాడే ఆ రోడ్డును దాటడానికి సాధారణ వ్యక్తులే తటపటాయిస్తారు. అలాంటి చోట, ఇద్దరు అంధులు... తమ చేతుల్లోని స్టిక్స్ సహాయంతో, ఒకరికొకరు భుజంపై చేయి వేసి అడుగులో అడుగు వేస్తూ జాగ్రత్తగా ముందుకు సాగారు. ఆ ఇద్దరు మిత్రులకు ఆ ఊత కర్రలు కేవలం దారి చూపడానికి మాత్రమే కాదు, వారి అంధమైన స్నేహ బంధానికి ప్రతీకగా కూడా మారాయి. ఒకరి కర్ర మరొకరి అడుగుకు మార్గదర్శనం చేయగా, ఒకరి చేయి మరొకరి భయాన్ని తొలగించింది. అంధకారాన్ని కూడా ధైర్యంగా దాటగలమనే విశ్వాసాన్ని వారి బంధం చాటిచెప్పింది. -ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఆకాశ పందిరిలో స్వర్ణవర్ణ కాంతులు



నింగివర్ణం మారింది. నిత్యం నీలి మేఘాలతో కనిపించే ఆకాశం... మంగళవారం సాయంత్రం సాగర తీరంపై బంగారు కాంతులు పలికించింది. బీచ్ రోడ్డులోని అన్నమయ్య విగ్రహం నుంచి వీక్షిస్తే, ఆకాశం ఒక్కసారిగా సువర్ణ శోభితంగా దర్శనమిచ్చింది. సముద్రపు ఒడ్డున నిలిచిన సందర్శకులు ఆ విభిన్నమైన, అపురూపమైన ఆ క్షణాన్ని తమ సెల్‌ఫోన్‌లలో బంధించడానికి ఉత్సాహంగా ప్రయత్నించారు. ప్రకృతి చిత్రించిన ఈ అద్భుత దృశ్యం అందరినీ మంత్రముగ్ధులను చేసింది.

ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై నిరసన గళం

- కూటమి తీరుపై వైఎస్సార్ సీపీ నేతల ఆగ్రహం
- మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయవద్దని డిమాండ్
- అంబేడ్కర్ స్మృతివనం జోలికొస్తే ఉద్యమం తప్పదు
- రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు
- ఆందోళనకు భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు



నిరసన వ్యక్తం చేస్తున్న రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, వైఎస్సార్‌సీపీ నేతలు వాసుపల్లి, మళ్ల విజయప్రసాద్, గొలగాని హరి వెంకట కుమారి జాన్‌వెస్లీ, బోని శివరామకృష్ణ తదితరులు

దాబాగార్డెన్స్: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, దళితులపై దాడులు, విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనం ప్రైవేటీకరణ యత్నాలపై కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టింది. పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ నేతృత్వంలో నగరంలోని డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈ నిరసన కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్య, వైద్యం ప్రజల హక్కు అని, వాటిని ప్రైవేటీకరించకూడదని పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావుతో పాటు విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తలు, రాష్ట్ర, జిల్లా నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గొల్ల బాబూరావు మాట్లాడుతూ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలు, చేపడుతున్న కార్యక్రమాలు కేవలం కార్పొరేట్ శక్తుల కోసమేనని విమర్శించారు. రాష్ట్రంలో 80 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను దృష్టిలో ఉంచుకుని, వారి భవిష్యత్ తరాల కోసం మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. ఇవి అమల్లోకి వస్తే లక్షలాది మంది పేదలకు ఉచిత వైద్యం, పేద విద్యార్థులకు ఉచిత మెడికల్ విద్య అందుతుందని తెలిపారు. అయితే, కూటమి ప్రభుత్వం దీనికి భిన్నంగా ఈ కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి యత్నించడం చాలా దుర్మార్గమని ధ్వజమెత్తారు.

- మాజీ ఎమ్మెల్యే, పార్టీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ దళితులు, పేద విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తి చూపేలా ఎస్సీ సెల్ చేపట్టిన ఈ కార్యక్రమం కూటమి ప్రభుత్వానికి ఒక హెచ్చరిక అని పేర్కొన్నారు. మెడికల్

మిగతా IIవ పేజీలో ▶

వాణిజ్యాన్ని గాలికొదిలేశారు

- కీలక పోస్టుల భర్తీ విషయంలో కూటమి ప్రభుత్వం కినుక
- జేసీ–1, ఇద్దరు డీసీలు, ఇద్దరు సీటీవోల కుర్చీల ఖాళీ
- ఏడాది కాలంగా జేసీ–1 పోస్టును భర్తీ చెయ్యకుండా నిర్లక్ష్యం
- ఐదుగురి పని భారం మొత్తం జేసీ–2పైనే..
- అయినా పట్టించుకోని ప్రభుత్వం



సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలో అత్యధిక ఆదాయాన్ని అందించే రెండో డివిజన్. చంద్రబాబు పదే పదే ఆర్థిక రాజధాని నగరమని చెప్పే ప్రాంతం.. దీనికి తోడు.. కొత్తగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణల అమలు కసరత్తులు.. ఇలా.. నిరంతర పనిభారం ఉన్న డివిజన్‌పై కూటమి ప్రభుత్వం కినుక వహిస్తోంది. అత్యంత కీలకమైన వాణిజ్య పన్నుల డివిజన్ ప్రధాన కార్యాలయంలో ప్రధాన పోస్టుల భర్తీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. మూడు నెలలుగా.. ఉన్నతాధికారుల పోస్టులు ఖాళీగా ఉండటంతో కార్యాలయంలో జాయింట్ కమిషనర్ సహా ప్రతి ఒక్కరిపైనా పనిభారం పెరిగిపోతోంది.

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు విశాఖ డివిజన్ పరిధిలోకి వస్తాయి. విశాఖ జిల్లాని మొత్తం 8 సర్కిల్స్‌గా విభజించి జీఎస్‌టీ వసూలు చేసేవారు. విశాఖ మహా నగర పరిధిలో మొత్తం 7 సర్కిల్స్, రూరల్ జిల్లాలోని మండలాలన్నీ కలిపి ఒక సర్కిల్ (అనకాపల్లి) మొత్తం 8 సర్కిల్స్ పరిధిలో 42 వేల మంది డీలర్స్ నుంచి పన్ను వసూళ్లు జరిగేవి. అయితే విశాఖ జిల్లాను మూడు జిల్లాలుగా రాష్ట్ర ప్రభుత్వం విభజించింది. ఈ నేపథ్యంలో డివిజన్‌లో ఉన్న ఎనిమిది సర్కిల్స్‌ని 14 సర్కిల్స్‌గా విభజించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మొత్తాన్ని ఒక సర్కిల్‌గా ఏర్పాటు చేసి దీనికి పాడేరు సర్కిల్ అని పేరుని సూచించారు. అదే విధంగా అనకాపల్లి జిల్లాను రెండు సర్కిల్స్‌గా విభజించారు. ఒకటి అనకాపల్లి సర్కిల్, రెండు అచ్యుతాపురం సర్కిల్‌గా నామకరణం చేశారు. ఇక మిగిలిన విశాఖ జిల్లాను మొత్తం 11 సర్కిల్స్‌గా విభజించారు. ప్రస్తుతం జీవీఎంసీ పరిధిలో ఉన్న వార్డులతో పాటు జిల్లా పరిధిలో ఉన్న ఆనందపురం, భీమిలి మండలాల్ని కలుపుకొని విభజన చేపట్టారు. కొత్తగా భీమిలి, మాధవధార, ఎయిర్‌పోర్టు సర్కిల్‌ని ఏర్పాటు చేశారు. వీటికితోడుగా గాజువాక, సిరిపురం, కురుపాం, డాబాగార్డెన్స్, ద్వారకానగర్, సిరిపురం, చినవాల్తేరు, స్టీల్‌ప్లాంట్ సర్కిల్స్‌గా విభజించారు. ప్రస్తుతం ఉన్న గాజువాక సర్కిల్‌ని గాజువాక, ఎయిర్‌పోర్టుగా విభజించారు. ప్రతి సర్కిల్ నుంచి దాదాపు సమాన ఆదాయం వచ్చేలా సర్దుబాటు చేశారు.

ఏడాదికి పైగా ముక్కుతూ మూలుగుతూ..

డివిజన్ విభజన సమయంలో జాయింట్ కమిషనర్ పోస్టులను రెండుగా విభజించారు. జేసీ–1గా ఐఏఎస్ అధికారిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2023లో జేసీ–1గా ఓ.ఆనంద్ వ్యవహరించారు. జేసీ–2గా సుధాకర్ విధులు నిర్వర్తించారు. ఆనంద్‌ని 2024 ఎన్నికల తర్వాత బదిలీ అయ్యారు. అప్పటి నుంచి రెగ్యులర్ జాయింట్ కమిషనర్‌ను నియమించలేదు. జేసీ–2గా సుధాకర్ స్థానంలో కిరణ్‌కుమార్‌ని నియమించారు. మూడు నెలల క్రితం జేసీ–2గా కిరణ్‌కుమార్ స్థానంలో శేషాద్రిని నియమించారు. కానీ.. జేసీ–1 నియామకం విషయంలో నిర్లక్ష్యం వహించారు. ఇప్పటి వరకూ జేసీ–1తో పాటు ఆయన విభాగంలో పనిచేసే మిగిలిన అధికారుల నియామకంపైనా కూటమి ప్రభుత్వం శీతకన్ను వేసింది. జేసీ–1తో పాటు.. డిప్యూటీ కమిషనర్–1, డిప్యూటీ కమిషనర్–2, నలుగురు అసిస్టెంట్ కమిషనర్లు(సీటీవోలు) పోస్టుల్లో విధులు నిర్వర్తించిన వారిని మూడు నెలల క్రితం బదిలీ చేసి వారి స్థానాల్ని ఇంతవరకూ భర్తీ చెయ్యలేదు. దీంతో జేసీ–1 పరిధిలో ఉన్న ఐదుగురు అధికారులు నిర్వర్తించే విధులన్నీ ఒకే అధికారిపై భారం పడింది. దీంతో వాణిజ్య పన్నుల శాఖ డివిజన్ కార్యాలయంలో ఫైళ్లు భారంగా కదులుతున్నాయి. జీఎస్‌టీ సంస్కరణలు వచ్చిన తర్వాత పని ఒత్తిడి మరింత పెరిగింది. దీంతో జేసీ–2తో పాటు ఇతర విభాగాల్లో ఉన్న అందరు ఉద్యోగులు నిరంతరం పనిచెయ్యాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఉద్యోగులకు వారాంతపు సెలవులు కూడా లేకుండా పనిచేస్తున్నారనీ.. వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చెయ్యాలని అసోసియేషన్లు ప్రభుత్వానికి పదే పదే నివేదించినా ఎలాంటి స్పందన లేదు. దీంతో.. అతి పెద్ద డివిజన్‌లో పనుల నిర్వహణ ఒత్తిడితో ఉద్యోగులు, అధికారులు సతమతమవుతూ అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. తక్షణమే అధికారుల పోస్టులు భర్తీ చెయ్యాలని వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నంత వరకూ అధికారుల నియామకాలు సక్రమంగా నిర్వహించారు. కూటమి వచ్చిన తర్వాత డివిజన్‌ని గాలికొదిలేసింది.

వాటర్ స్పోర్ట్స్ హబ్‌గా విశాఖ

వసతులు పరిశీలించిన శాప్ బృందం

విశాఖ స్పోర్ట్స్: స్పోర్ట్స్ అకాడమీల ఏర్పాటు కోసం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ప్రతినిధులు మంగళవారం విశాఖలోని క్రీడా వసతులను పరిశీలించారు. కొమ్మాదిలోని సమీకృత స్టేడియం, గాజువాక, గోపాలపట్నంలోని శాప్ ఇండోర్ హాల్‌లను నలుగురు సభ్యుల బృందం సందర్శించింది. రాష్ట్రంలో బాల బాలికలకు ఏయే ప్రాంతాల్లో, ఏయే క్రీడలకు అవసరమైన సదుపాయాలు, అకాడమీలు ఏర్పాటు చేయాలనే అంశంపై రెండు బృందాలు విశాఖ, కాకినాడ, నెల్లూరు, తిరుపతిలో అధ్యయనం చేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న వసతులు, అకాడమీల ఏర్పాటుకు అవసరమైన అదనపు మౌలిక సదుపాయాలపై ఈ బృందం త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. కొమ్మాది సమీకృత స్టేడియం పరిశీలన అనంతరం శాప్ బృందంలోని సభ్యులు ఎ. రమణారావు, బుచ్చిరాజు, జగదీశ్వరి, రవీంద్ర విలేకరులతో మాట్లాడారు. 'ప్రస్తుతం కొమ్మాదితో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న క్రీడా వసతులను, అదనంగా కల్పించాల్సిన మౌలిక సదుపాయాలను పరిశీలిస్తున్నాం. వాటర్ స్పోర్ట్స్‌కు విశాఖపట్నాన్ని హబ్‌గా తీర్చిదిద్దడానికి తీసుకోవాల్సిన చర్యలు, టూరిజం అభివృద్ధికి అవసరమయ్యే వసతులపైనా అధ్యయనం చేస్తున్నాం.' అని తెలిపారు. పురుషులు, మహిళలకు తగిన క్రీడా వసతులు, వారికి శిక్షణతో కూడిన అకాడమీలు, హాస్టళ్ల ఏర్పాటుకు కృషి జరుగుతోందని స్పష్టం చేశారు. శాప్ ప్రతినిధులకు వీడీఎస్‌ఏ పూర్వ క్రీడాధికారి జూన్ గాలియట్, ప్రస్తుత జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు సహకరించి స్థానిక పరిస్థితులను వివరించారు.

వెంటిలేటర్లకు సుస్తీ

ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్యానికి పెద్ద దిక్కుగా నిలుస్తున్న కేజీహెచ్‌లో పేదల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. అత్యవసర సమయాల్లో ఊపిరి పోయాల్సిన వెంటిలేటర్లే శ్వాస తీసుకోలేక మూలకు చేరాయి. దాదాపు 400 వెంటిలేటర్లకు గాను 300కు పైగా పనిచేయకపోవడం, ప్రభుత్వ వైద్యంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. ఇది కేవలం యంత్రాల వైఫల్యం కాదు.. పేదల పట్ల వ్యవస్థ నిర్లక్ష్యానికి నిలువుటద్దం. –మహారాణిపేట

- కేజీహెచ్‌లో పనిచేయని వెంటిలేటర్లు
- క్యాజువాలిటీతో పాటు వివిధ విభాగాల్లో మూలకు చేరిన ప్రాణదాతలు
- గాల్లో పేద రోగుల ప్రాణాలు
- పట్టించుకోని యంత్రాంగం
- కలెక్టర్ జోక్యం చేసుకోవాలని రోగులు, వారి బంధువుల వినతి

కేజీహెచ్‌లో అత్యవసర వైద్య సేవలు కునారిల్లుతున్నాయి. ఇటీవల ఆర్టీ రియల్ బ్లడ్ గ్యాస్(ఏబీజీ) పరీక్షలు నిలిచిపోయాయి. వ్యాధులు నిర్ధారించే రక్త పరీక్షల కోసం పేదలు ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో రోగికి పునర్జన్మనివ్వడంలో కీలక పాత్ర పోషించే వెంటిలేటర్లు భారీ సంఖ్యలో మరమ్మతులకు గురై మూలనపడటంతో.. నిరుపేద రోగుల ప్రాణాలు గాల్లో దీపాల్లా మారాయి.

పనిచేయనివి 311

కేజీహెచ్‌లోని 26కు పైగా విభాగాల్లో సుమారు 403 వెంటిలేటర్లు ఉండగా.. ప్రస్తుతం కేవలం 92 మాత్రమే పనిచేస్తున్నాయని తెలిసింది. అంటే సుమారు 311 వెంటిలేటర్లు పనిచేయడం లేదు. క్యాజువాలిటీ, ఐసీయూ, కార్డియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ వంటి అత్యంత కీలకమైన విభాగాల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. రోడ్డు, అగ్ని ప్రమాద బాధితులు, గుండె జబ్బులతో బాధపడేవారు, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది పడుతున్న వారికి వెంటిలేటర్ అత్యవసరం. అలాంటి ప్రాణదాతలే పనిచేయకపోవడంతో.. వైద్యులున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి నెలకొంది. వార్డుల్లో పనిచేయని యంత్రాలను పక్కన పడేయడం గమనార్హం.

వెంటిలేటర్లదే కీలకపాత్ర

రోగుల ప్రాణాలను కాపాడడంలో వెంటిలేటర్ ఎంతో కీలకపాత్ర పోషిస్తుంది. సొంతంగా శ్వాస తీసుకోలేని స్థితిలో ఉన్న వారికి, ఈ యంత్రం ఊపిరితిత్తుల్లోకి గాలిని పంపి, వారు తిరిగి తమంతట తాము శ్వాస తీసుకునే వరకు జీవనాధారంగా నిలుస్తుంది. అందుకే ప్రతి ఆస్పత్రి, అంబులెన్స్, ఇతర ముఖ్యమైన ఆరోగ్య సేవా కేంద్రాల్లో వెంటిలేటర్లను అత్యవసరంగా సిద్ధంగా ఉంచుతారు.



మూలకు చేరిన వెంటిలేటర్

అయితే, ఇంతటి కీలకమైన వెంటిలేటర్లు కేజీహెచ్‌లో పనిచేయకపోవడం ఇప్పుడు రోగులకు ప్రాణాలకు సంకటంగా మారింది. కాగా.. కేజీహెచ్‌లో వెంటిలేటర్ సదుపాయం ఉచితంగా లభిస్తుంది. అదే ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోజుకు రూ. 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ భారం మోయలేక ఎంతోమంది పేద, మధ్య తరగతి కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి. ప్రైవేట్‌లో చికిత్స చేయించలేక, చివరికి కేజీహెచ్‌కే తిరిగి వస్తున్న రోగులు ఎందరో.. అలాంటి వారికి ఇక్కడ కూడా వెంటిలేటర్ సదుపాయం అందకపోవడంతో.. వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది.

పట్టని యంత్రాంగం

కేజీహెచ్‌కు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, ఇతర రాష్ట్రాల రోగులు వైద్యం కోసం వస్తుంటారు. ఆస్పత్రిలో 1,187 పడకలు ఉండగా.. నిత్యం 2,500 మందికి పైగా రోగులకు ఇక్కడ వైద్యం అందుతోంది. సోమవారం నుంచి శనివారం వరకు రోజూ 1,500 నుంచి 2,200 వరకు ఓపీ నమోదవుతుంది. రోజూ 300 నుంచి 600 మంది రోగుల వరకు ఇన్‌పేషంట్లుగా చేరుతుంటారు. అయితే వారికి తగ్గట్లు మౌలిక వసతులు పెరగడం లేదు. ఉన్న వైద్య పరికరాల నిర్వహణ కూడా సరిగ్గా లేదు. కొద్ది రోజుల కిందట ఏబీజీ రక్త పరీక్షల యంత్రాలు పనిచేయకపోవడం, ఇప్పుడు వెంటిలేటర్ల సమస్య రావడం ఇక్కడి నిర్లక్ష్యానికి నిదర్శనం. పాలనాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంతో సమస్య తీవ్రమవుతోంది. పేదల ప్రాణాలతో ముడిపడి ఉన్న ఈ సమస్యపై కలెక్టర్ వెంటనే దృష్టి సారించాలని, మరమ్మతులకు గురైన వెంటిలేటర్లను బాగు చేయించాలని రోగుల బంధువులు, ప్రజలు కోరుతున్నారు.



కేజీహెచ్ అత్యవసర విభాగం



పనిచేయలేని వెంటిలేటర్

నేడు సీఎం చంద్రబాబు రాక

ఎయిర్‌పోర్ట్‌లో సీపీ భద్రతా సమీక్ష



ఎయిర్‌పోర్టులో సమీక్ష చేస్తున్న సీపీ బాగ్చి

మహారాణిపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ఉదయం 11 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి ఆయన విజయనగరం జిల్లా, దత్తిరాజేరు మండలం, దత్తి గ్రామానికి పయనమవుతారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రజా వేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. తర్వాత పార్టీ నాయకులతో సమావేశమవుతారు. అనంతరం ఆయన ఉండవల్లిలోని తన నివాసానికి తిరిగి వెళతారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ మేరీ ప్రశాంతి, సీఐఎస్ఎఫ్ అధికారి నవనీత్ కౌర్‌తో పాటు రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు ఎయిర్‌పోర్టులో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

రేపు రావణవధ ఉత్సవం

హరేకృష్ణ వైకుంఠంలో ఏర్పాట్లు



25 అడుగుల రావణుడి బొమ్మను తయారు చేస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీలోని హరేకృష్ణ వైకుంఠం వద్ద గురువారం రావణవధ ఉత్సవం జరగనుంది. విజయదశమి సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో 25 అడుగుల ఎత్తుగల రావణుడి బొమ్మను బాణసంచాతో తయారు చేస్తున్నారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస మాట్లాడుతూ త్రేతాయుగంలో విజయదశమి నాడు శ్రీరామచంద్రుడు రావణుడిపై సాధించిన విజయానికి సంకేతంగా ఉత్తరాది రాష్ట్రాల్లో ఘనంగా జరుపుకునే ఈ ఉత్సవాన్ని.. రెండో ఏడాది ఇక్కడ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ అష్టోత్తర హోమం, శ్రీరామలీలా ప్రవచనం, మహా మంగళ హారతి, రావణవధ, సాంస్కృతిక కార్యక్రమాలు, తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమానికి ముందు జాగ్రత్తగా అగ్నిమాపకశాఖ సిబ్బందితో ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి అంబరీష దాస కోరారు.

రైల్వే విశ్రాంత ఉద్యోగి నేత్రాలు దానం



తండ్రి నేత్రాలను దానం చేసేందుకు అంగీకారం తెలుపుతున్న కుమారులు రాంబాబు, వంశీ



భవానీశంకరం (ఫైల్)

పెందుర్తి: మరణించిన తన తండ్రి నేత్రాలను దానం చేసి ఇద్దరు కుమారులు పెద్ద మనసు చాటుకున్నారు. పెందుర్తిలోని వెలమతోటలో నివాసం ఉంటున్న రైల్వే విశ్రాంత ఉద్యోగి నేమాని భవానీశంకరం(84) మంగళవారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్ నేత్ర దానం కోసం మృతుని కుటుంబాన్ని సంప్రదించారు. దీంతో తండ్రి నేత్రాలను దానం చేయడానికి కుమారులు నేమాని రాంబాబు, వంశీ అంగీకారం తెలిపారు. వెంటనే ఎల్‌వీ ప్రసాద్ మోషిన్ ఐబ్యాంక్ ప్రతినిధి కృష్ణ.. భవానీశంకరం నేత్రాల(కార్నియా)ను సేకరించారు. తండ్రి నేత్రాలను దానం చేసి ఇద్దరు అంధులకు చూపు అందించేందుకు సహకరించిన కుమారులను పలువురు ప్రశంసించారు.

ట్రయాంగిల్ వివాహేతర స్టోరీ

- రైల్వే ఉద్యోగుల మధ్య వివాహేతర సంబంధం
- అందులో ఒకరు.. మరో ఇద్దరిపై చాకుతో దాడి
- తొలుత దోపిడీ కేసుగా నమోదు
- దర్యాప్తులో వెలుగులోకి అసలు విషయం

గోపాలపట్నం: రైల్వే ఉద్యోగుల మధ్య నెలకొన్న వివాహేతర సంబంధం చివరికి చాకుపోట్లకు దారితీసింది. తనతో సంబంధం కొనసాగిస్తున్న మహిళ మరో వ్యక్తితో సన్నిహితంగా ఉండడాన్ని భరించలేని ఒక ఉద్యోగి ఈ దాడికి పాల్పడ్డాడు. తొలుత దోపిడీ కేసుగా నమోదైన ఈ ఘటన.. పోలీసుల దర్యాప్తులో వివాహేతర సంబంధమే అసలు కారణంగా తేలడంతో నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివి.. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం, గణపతినగర్‌లోని ఒక రెసిడెన్సీలో నివాసముంటున్న చంద్రకళ(రైల్వే ఉద్యోగి) భర్త మరణానంతరం ఉద్యోగం పొందింది. ఆమెకు రైల్వే మెకానికల్ విభాగంలో పని చేసే ఏనుగుల నాగరాజుతో వివాహేతర సంబంధం ఉంది. శనివారం రాత్రి నాగరాజు చంద్రకళ ఇంటికి వచ్చాడు. రాత్రి అక్కడే ఉన్నాడు. అయితే, చంద్రకళ మరొకరితో సంబంధం కొనసాగిస్తోందని అనుమానం పెంచుకున్న నాగరాజు.. మధ్య రాత్రి తాను వెళ్లిపోతున్నానని చెప్పి.. అపార్ట్‌మెంట్ టెర్రస్‌పై దాక్కున్నాడు. నాగరాజు వెళ్లిపోయాడని భావించిన చంద్రకళ.. లోకో పైలెట్‌గా పని చేస్తున్న గౌరి నాయుడును తన ద్విచక్ర వాహనంపై వెళ్లి తీసుకువచ్చింది. కొద్దిసేపటి తర్వాత, మేడపై దాగి ఉన్న నాగరాజు ఆమె ఇంటికి వచ్చి గొడవకు దిగాడు. ఈ క్రమంలో కోపోద్రిక్తుడై ఇంట్లో ఉన్న చాకుతో దాడి చేశాడు. ఈ దాడిలో గౌరి నాయుడు, చంద్రకళ ఇద్దరికీ గాయాలయ్యాయి. వెంటనే ముగ్గురూ చంద్రకళ కారులో బయలుదేరగా.. నాగరాజు గోపాలపట్నంలో దిగిపోయాడు. గౌరి నాయుడు, చంద్రకళ చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేరారు.

దోపిడీగా నమ్మించే ప్రయత్నం

ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు గోపాలపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే గాయపడిన గౌరి నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేస్తూ.. తాను డ్యూటీ దిగి ఉత్తర సింహాచలం నుంచి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించారని పేర్కొన్నాడు. బంగారు చైన్, డబ్బులు అడిగారని, నిరాకరించడంతో కత్తితో దాడి చేశారని చెప్పాడు. దీంతో గోపాలపట్నం పోలీసులు తొలుత దోపిడీ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే లోతుగా దర్యాప్తు చేయగా.. అసలు దాడికి కారణం రైల్వే ఉద్యోగుల మధ్య ఉన్న వివాహేతర సంబంధమేనని తేలింది. రహస్యం బయటపడకుండా ఉండేందుకే బాధితులు తప్పుడు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు గుర్తించారు. కేసులో వాస్తవం బయటపడటంతో నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం అతన్ని రిమాండ్‌కు తరలించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై

నిరసన గళం


▶ I వ పేజీ తరువాయి

కళాశాలలను ప్రైవేట్, కార్పొరేట్‌కు కట్టబెట్టడం దౌర్భాగ్యమన్నారు. చంద్రబాబు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్రంలోని పెద్దలు గుర్తించి, ఆయనను భర్తరఫ్ చెయ్యాలని డిమాండ్ చేశారు.

- మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి కూడా ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని, విద్య, వైద్యం ప్రైవేట్ పరం చేస్తే తిరుగుబాటు మరింత తీవ్రమవుతుందని హెచ్చరించారు.

కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, పార్టీ జాయింట్ సెక్రటరీ తాడి జగన్నాథరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెయ్యి వెంకటరమణ, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంట్రెడ్డి రామన్నపాత్రుడు, క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ, అనుబంధ సంఘాల నాయకులు పేర్ల విజయచందర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, పార్టీ ముఖ్య నాయకులు రొంగలి జగన్నాథం, డాక్టర్ జహీర్ అహ్మద్, రవిరాజు, నడింపల్లి కృష్ణంరాజు, జిల్లా అనుబంధ సంఘాల నాయకులు అంబటి నాగ వినాయక శైలేష్, ఉరుకూటి రామచంద్రరావు (చందు), పేడాడ రమణికుమారి, సనపల రవీంద్ర భరత్, బర్కత్ ఆలీ, చెన్నా జానకీరామ్, రవిబాబు, సేనాపతి అప్పారావు, పీలా ప్రేమ్ కిరణ్, దేవరకొండ మార్కండేయలు, సకలాభక్తుల ప్రసాదరావు, కటికల కల్పన, వడ్డాది దిలీప్‌కుమార్, వంకాయ మారుతీప్రసాద్, బొండా ఉమా మహేశ్వరరావు, జీలకర్ర నాగేంద్ర, నీలి రవి, శ్రీదేవి వర్మ, అల్లంపల్లి రాజాబాబు, గూడపాటి జోసెఫ్, కోన వెంకట శంకర సన్యాసిరావు, బంగారు భవానీ శంకర్, ఆకుల శ్యామ్, లక్ష్మారావు, పూడి మల్లేశ్వరరావు, కార్పొరేటర్లు దొలపల్లి ఏడుకొండలరావు, బిపిన్‌కుమార్ జైన్, గుండపు నాగేశ్వరరావు, బర్కత్ ఆలీ, కేవీ శశికళ, బల్లా లక్ష్మణ్, గుడివాడ సాయి అనూష లతీష్, కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్, అనుబంధ నాయకులు పల్లా దుర్గ, డి.రామకృష్ణా రెడ్డి, బయ్యవరపు రాధ, కేవీ బాబా, సాగర్, పులగం శ్రీనివాసరెడ్డి, పచ్చిరపల్లి రాము పలు వార్డుల అధ్యక్షులు పాల్గొన్నారు.

వెంకటాద్రిపై కొండచిలువ కలకలం




కొండ చిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్ సురేష్

పెందుర్తి: వెంకటాద్రిపై మంగళవారం ఒక కొండచిలువ కనిపించడంతో కలకలం రేగింది. వెంకటాద్రిపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి కొంత దూరంలో ఆలయ ప్రధాన అర్చకులు మహర్షి రామానుజాచార్యులు కొండచిలువను గుర్తించారు. వెంటనే పోలీసులకు, స్థానిక స్నేక్ క్యాచర్ సురేష్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సురేష్.. కొండచిలువను చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం దానిని సురక్షితంగా అటవీ ప్రాంతంలో విడిచిపెట్టడంతో స్థానికులు, ఆలయ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

అప్పన్న జమ్మివేట ఉత్సవం రేపు

- ముస్తాబయిన పూలతోట
- రామాలంకారంలో దర్శనమివ్వనున్న శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామి
- రేపు సాయంత్రం 6 గంటల వరకే స్వామి దర్శనాలు

సింహాచలం: విజయదశమి పర్వదినం పురస్కరించుకుని గురువారం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి జమ్మివేట ఉత్సవం వైభవంగా జరగనుంది. కొండ దిగువన ఉన్న పూలతోటలో ఈ ఉత్సవాన్ని నిర్వహించేందుకు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు పర్యవేక్షణలో ఇంజినీరింగ్ అధికారులు విశేష ఏర్పాట్లు చేస్తున్నారు. పూలతోటలోని ప్రధాన మండపానికి, శ్రీకృష్ణ కొలనుకు నూతనంగా రంగులు వేశారు. పారిశుధ్య పనులు నిర్వహించడంతో పాటు, పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గోపాలపట్నం పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయనున్నారు.



ముస్తాబయిన ప్రధాన మండపం

ఉత్సవం జరుగుతుంది ఇలా..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి రామాలంకారం చేసి గురువారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో సింహగిరి నుంచి మెట్ల మార్గంలో పల్లకీలో కొండ దిగువకు తీసుకొస్తారు. కొండదిగువ ఉన్న పూలతోటలోని ప్రధాన మండపంలో స్వామిని అధిష్టింపజేస్తారు. సాయంత్రం పూలతోటలోని శమీ వృక్షం చెంతన శమీ పూజ నిర్వహిస్తారు. అనంతరం ఆ శమీ దళాలను స్వామి చెంతన ఉంచి ప్రత్యేక పూజలు చేసి, జమ్మివేట ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఆ తర్వాత స్వామిని పుష్కరిణి మండపం వద్దకు తీసుకొచ్చి, అక్కడ ఉండే అశ్వవాహనంపై అధిష్టింపజేస్తారు. అనంతరం అడవివరం గ్రామంలో స్వామికి అశ్వవాహనంపై గ్రామ తిరువీధి నిర్వహిస్తారు. అర్ధరాత్రి సమయంలో స్వామిని తిరిగి కొండపైకి చేరుస్తారు. జమ్మివేట ఉత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సింహగిరిపై స్వామి దర్శనాలు సాయంత్రం 6 గంటల వరకే భక్తులకు లభిస్తాయని ఆలయ అధికారులు తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.



పూలతోటలోని శమీవృక్షం

సింహాద్రినాథుడి సన్నిధిలో సీఎం కార్యదర్శి ప్రద్యుమ్న



ప్రద్యుమ్నకి అప్పన్న చిత్రపటం అందజేస్తున్న డిప్యూటీ ఈవో రాధ

సింహాచలం: రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న కుటుంబ సమేతంగా మంగళవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారిని దర్శించుకున్నారు. మొదట కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడ మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో అర్చకులు వారికి అష్టోత్తరం పూజ నిర్వహించారు. అనంతరం వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం, డిప్యూటీ ఈవో రాధ స్వామి వారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాలను ప్రద్యుమ్నకు అందజేశారు.

సీఈటీపీతో అదనపు ప్రయోజనాలు

కస్టమ్స్ కమిషనర్ శ్రీధర్



సదస్సులో ప్రసంగిస్తున్న శ్రీనివాస్ ముప్పాల

ఏయూక్యాంపస్: భారత్–యూకేల మధ్య ప్రతిపాదిత సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం(సీఈటీపీ)పై విశాఖ ప్రత్యేక ఆర్థిక మండలి(వీఎస్ఈజెడ్) ఆధ్వర్యంలో నోవాటెల్ హోటల్‌లో మంగళవారం ఔట్‌రీచ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎస్ఈజెడ్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్ ముప్పాల సీఈటీపీ వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. రూల్ ఆఫ్ ఆరిజిన్, పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్, సేవల కోసం మార్కెట్ యాక్సెస్, వస్తువులకు సుంకం లేని యాక్సెస్ వంటి కీలక అంశాలను వివరించారు. జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి కోరాటి మాట్లాడుతూ ఎగుమతిదారుల్లో అవగాహన పెంచడానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ భారత్–యూకే సీఈటీపీ అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని ఎగుమతిదారులకు లభించే ప్రత్యేక ప్రయోజనాలను వివరించారు. రాయల్‌బరో ఆఫ్ కెన్సింగ్టన్(లండన్) డిప్యూటీ మేయర్ అరీన్ ఉదయ్ ఆరేటి మాట్లాడుతూ భారతీయ ఎగుమతిదారులు వ్యవసాయ, ఆహార శుద్ధి రంగాల్లో నాణ్యతా ప్రమాణాలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. నూతన ఒప్పందం ఫలితంగా రెండు దేశాలకు మేలు జరుగుతుందని తెలిపారు. వీఎస్ఈజెడ్ డిప్యూటీ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎ.వి.శివ ప్రసాద్‌రెడ్డి 'భారతీయ ఎగుమతిదారులకు అవకాశాలు' అనే అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో శ్రావణ్ షిప్పింగ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సాంబశివరావు, ఈపీసీఈఎస్ చైర్మన్ శ్రీకాంత్ బడిత తదితరులు తమ ఆలోచనలను పంచుకున్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తు గడువు పొడిగింపు

అనకాపల్లి టౌన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్) దరఖాస్తు గడువును వచ్చే నెల 15 వరకు పొడిగించినట్టు ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు కె.వి.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్. వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారం, ప్రవేశ పరీక్ష రుసుం వివరాల కాపీలను డీఈవో కార్యాలయంలో అక్టోబర్ 18వ తేదీలోగా సమర్పించాలని సూచించారు.

గజలక్ష్మిగా కనకమహాలక్ష్మి

లక్ష గాజులతో సహస్రనామార్చన

దాబాగార్డెన్స్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారు మంగళవారం గజలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి లక్ష గాజులతో సహస్రనామార్చన వైభవంగా నిర్వహించారు. నగరానికి చెందిన సుంకర రామరవీంద్ర, హైదరాబాద్‌కు చెందిన రామిరెడ్డి అనిత, విజయవాడకు చెందిన వెంకట బుజ్జి కిరణ్ రూ.1.25 లక్షల చొప్పున చెల్లించి తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ పూజలో పాల్గొన్నారు. బుధవారం అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమివ్వనున్నారని, అమ్మవారికి అన్ని రకాల కూరగాయల(శాకంబరీ)తో సహస్రనామార్చన చేయనున్నట్లు ఈవో శోభారాణి తెలిపారు.



భక్తులను ఆశీర్వదిస్తున్న అర్చకుడు

అలాగే అంబికాబాగ్ రామాలయంలో బెంగాలీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవికి ఘనంగా పూజలు జరుగుతున్నాయి. మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.



దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు

నేడు పింఛన్ల పంపిణీ

మహారాణిపేట: ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశాల మేరకు ఈ పంపిణీ జరగనుంది. జిల్లాలో మొత్తం 1,60,200 పింఛన్‌దారులు ఉన్నారు. వీరి కోసం ప్రభుత్వం రూ. 70 కోట్ల 30 వేల 200 విడుదల చేసింది. బయోమెట్రిక్ గుర్తింపు ద్వారా సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ విభాగం, నగర పరిధిలో జీవీఎంసీ సిబ్బంది పింఛన్లు అందజేస్తారని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీపతి తెలిపారు.